యాదగిరీశుడికి వైభవంగా నిత్యారాధనలు

గోశాలలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ఈఓ గీత

యాదగిరిగుట్ట, డిసెంబర్ 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల నిత్యారాధనలు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామిని మేల్కొల్పి తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శ నారసింహ హోమం నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. ప్రధానాలయ ముఖ మండపంలో శ్రీవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులకు సువర్ణ పుష్పార్చనలు చేశారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చించారు. సాయంత్రం వేళలో స్వామి వారికి తిరువీధి, దర్బార్ సేవ ఘనంగా నిర్వహించారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ. 27,73,072 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

కార్తీక వన భోజనాలు

దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్తీక వన భోజనం కమనీయంగా సాగింది. మల్లాపురం గ్రామ పరిధిలోని ఆలయ తోటలో మొదటగా గణపతి పూజ, స్వస్తివాచనం, ఆదిత్యాది నవగ్రరాధన, మండపారాధన, సత్యనారాయణ స్వామి పూజ, తులసీదాత్రి సమేత కార్తీక దామోదర స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించి తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి వనభోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గుట్టలో కార్తీకమాస రాబడి రూ.14.91కోట్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామికి కార్తీక మాసం సందర్భంగా 29రోజులకు గాను రూ.14,91,10,031 ఆదాయం సమకూరిందని ఆలయాధికారులు తెలిపారు. గతేడాది(2022) 23రోజులకు గాను రూ.14,66,43,048 ఆదాయం సమకూరగా ఈసారి 29రోజులకు గాను మొత్తం ఆదాయంలో రూ.24,66,983 ఆదాయం పెరిగిందని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం అనంతరం అత్యధికంగా జరిగే సత్యనారాయణ స్వామి వ్రతాలు ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సల్పంగా తగ్గిందని, మొత్తం 18,824 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొనగా రూ. 1,64,20,600 ఆదాయం వచ్చిందని తెలిపారు. గతేడాది 21,480మంది దంపతులు వ్రతాల్లో పాల్గొనగా స్వామివారికి రూ. 1,71,84,000 ఆదాయం వచ్చిందని తెలిపారు.

ఫుట్‌బాల్‌లో చండూరు జట్టు విజయం

- ముగిసిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా పోటీలు
- వివిధ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేత
- పాల్గొన్న కలెక్టర్ హనుమంతు జెండగే, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

రాజాపేట, డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేపట్టిన 9వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నాల్గోరోజు మంగళవారం అట్టహాసంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో 8జోన్ల క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ జండగే హనుమంత్ కొండిబా, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఘన స్వాగతం పలికారు. పోటీల అనంతరం కబడ్డీ, వాలీబాల్, పుట్‌బాల్, బాల్ బాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్, చెస్ ఫైనల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ హనుమంతు జెండగే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ క్రీడలంటే తనకు చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువని, అలాంటి క్రీడలకు ప్రభుత్వపరంగా మరింత ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో ఆర్టీఓ అమరేందర్, ఆర్‌సీఓలు రజిని, శ్రీరామ్, యాదగిరిగుట్ట జడ్పీటీసీ అనూరాధ, ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, సర్పంచ్ ఆడేపు ఈశ్వరమ్మాశ్రీశైలం, ఎంపీటీసీ దాచపల్లి రాజు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జూకంటి ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ అంకతి బాలయ్య, నాయకులు నెమిలే మహేందర్‌గౌడ్, గౌటే లక్ష్మణ్, బాల్‌రాజ్‌గౌడ్, బుడిగె పెంటయ్యగౌడ్, మసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నెమిలే కేథారి, ఇంజ నరేశ్, నవీన్‌కుమార్, గంధమల్ల నర్సింహులు, రాంజీనాయక్, విఠల్‌నాయక్, తాసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్, ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, క్రీడల ఇన్‌చార్జి ఉదయ్‌భాస్కర్, ప్రిన్సిపాల్ నర్సింహాచారి, అర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ నరేశ్ పాల్గొన్నారు.

ఫైనల్ విజేతలు వీరే..

అండర్-19 విభాగం : కబడ్డీ పోటీల్లో జోన్7 లింగాల, టెన్నికాయిట్‌లో జోన్1 జక్కారం జట్టు, కార్యమ్‌లో జోన్6 సింగూరు, చెస్ పోటీల్లో జోన్2 రాజ్‌కుమార్ ఇచ్చోడ్, వాలీబాల్ పోటీల్లో జోన్1 కోటపల్లి, బాల్ బాడ్మింటన్ పోటీల్లో జోన్6 పరిగి, పుట్‌బాల్ పోటీల్లో జోన్1 జైపూర్ జట్లు గెలుపొందాయి.

అండర్- 17 విభాగం : కబడ్డీ పోటీలో జోన్2 మానకొండూరు, టెన్నికాయిట్ పోటీలో జోన్1 జక్కారం జట్టు, క్యారమ్స్‌లో జోన్1 కాసీపేట, చెస్‌లో జోన్7 బిజేనేపల్లి, వాలీబాల్‌లో జోన్ 5ఏ సింగూరు, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జోన్2 మానకొండూరు, పుట్‌బాల్ పోటీల్లో జోన్5 చండూరు జట్లు గెలుపొందాయి.

అండర్-14 విభాగం : కబడ్డీ పోటీల్లో జోన్7 వెపనగడ్డ, టెన్నికాయిట్ పోటీల్లో జోన్1 జక్కారం, క్యారమ్‌లో జోన్3 కొండపాక, చెస్‌లో జోన్6 షాయిక్‌పేట్ జట్లు గెలుపొందాయి.

ఎంజీయూలో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

రన్నింగ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

రామగిరి, డిసెంబర్ 12 : ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్ (ఐసీటీ) పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్ స్త్రీ, పురుషుల పోటీలు మంగళవారం అటహాసంగా ప్రారంభమయ్యాయి. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను వర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. తొలిరోజు క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని వీసీ సీహెచ్.గోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అల్వాల రవి అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.మురళి, వివిధ కళాశాల పీడీలు, ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేతకు చిరుమర్తి పరామర్శ

సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మంగళవారం పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ కేసీఆర్ త్వరగా కోలుకుని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు.

– నకిరేకల్, డిసెంబర్ 12

క్రీస్తు బోధనలు అనుసరణీయం

క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- సూర్యాపేటలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 12 : ప్రేమ, కరుణ, క్షమను కలిగి ఉండాలని యేసుక్రీస్తు చేసిన బోధనలు సమస్త మానవాళికి అనుసరణీయమని సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్‌ను పండుగను పురస్కరించుకొని ఫాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా చైర్మన్ మామిడి సామ్‌సన్ ఆధ్వర్యంలో సూర్యాపేటలోని లివింగ్ గాడ్ బాప్టిస్టు చర్చిలో ఫాస్టర్లు, సువార్తీకులకు మంగళవారం నిర్వహించిన దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖ శాంతులతో ఉంటుందన్నారు. యేసుక్రీస్తు ఈ లోకంలోని ప్రజలందరికీ ప్రేమ, ఆప్యాయతను నేర్పించారని తెలిపారు. ఎదుటివారిని ప్రేమించే గుణం మనలో ఉండాలని సూచించారు. ఎన్నో ఏండ్లుగా శాంసన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి పేదవాడు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో పదేండ్లుగా మాజీ సీఎం కేసీఆర్ దుస్తులను పంపిణీ చేశారన్నారు. అదే సంప్రదాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలని సూచించారు. ముఖ్య ప్రసంగీకులు డాక్టర్ రెవరెండ్ ఎం.ప్రభుదాస్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ జిల్లా నాయకులు పూర్ణ శశికాంత్, ఫాస్టర్స్ ఫెలోషిప్ నియోజకవర్గ అధ్యక్షుడు మీసాల గోవర్ధన్, పట్టణ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్, మరియన్న, ఫాస్టర్ జవహర్‌ఫాల్, జాకబ్, బాబూరావు, డేవిడ్ రాజు, సత్యప్రకాశ్, లింగా నాయక్, రాజరత్నం, బొడ్డు మత్తయ్య, సాల్మన్ రాజు, మచ్చ యేసుపాదం, మనిదాసు, పద్యం రాజు, కోట సామ్‌సన్, జాన్ దుర్గాప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన చెర్వుగట్టు

రామలింగేశ్వర స్వామికి వైభవంగా లక్ష పుష్పార్చన

చెర్వుగుట్టపై భక్తజన సందోహం

నార్కట్‌పల్లి, డిసెంబర్ 12 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. అమావాస్య కావడంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ ఈఓ నవీన్ కుమార్ భక్తులకు మౌలిక వసతులు కల్పించారు.